భూ సమస్యలే అధికం..!

- ప్రజావాణిలో కలెక్టర్ స్వీకరించిన ఫిర్యాదులు 193
- భూకబ్జాలు.. ధరణికి సంబంధించినవి 100 పైనే..
- పరిష్కరిస్తుందన్న ఆశతో కలెక్టరేట్‌కు పెరిగిన తాకిడి
- శివారు భూసమస్యలపై ప్రత్యేక చొరవకు సీఎం ఆదేశాలు
- కీసర మండలంలో అక్రమ నిర్మాణాలను కూల్చిన యంత్రాంగం



సాక్షి, మేడ్చల్ జిల్లా: కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత భూసంబంధిత వాటితో సహా అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం ప్రజల్లో పెరిగింది. దీంతో కలెక్టరేట్‌లో ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల తాకిడి పెరుగుతోంది. పైగా జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రజావాణికి హాజరవుతుండటంతో.. తమ సమస్యలకు సత్వరమే మోక్షం కలుగుతుందన్న ఆశలు కూడా ఫిర్యాదుదారుల్లో వ్యక్తం అవుతోంది. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చేపట్టిన ప్రజావాణిలో కలెక్టర్ గౌతమ్‌కు 193 ఫిర్యాదులు అందడమేనని తెలుస్తోంది. వీటిలో భూసంబంధిత ఫిర్యాదులు అధికంగా ఉండటమే. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో భూసమస్యలకు సంబంధించి ధరణి, భూకబ్జాలు.., ప్రభుత్వ, సీలింగ్, దేవాదాయ, అసైన్డ్ భూముల పరిరక్షణ, ఇళ్ల స్థలాలు తదితరవే అధికంగా ఉంటాయి. ఈ సమస్యలపైనే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు వెల్లువలా వస్తుంటాయి. మేడ్చల్ కలెక్టరేట్ ప్రజలకు అందుబాటులో లేకపోయినా.. సరైన రవాణా వసతులు లేకపోయినా, సొంత వాహనమో.. లేదా అద్దె వాహనాలతో తమ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు మొర పెట్టుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి బస్తీ, గ్రామ, పట్టణవాసులు తరలివస్తున్నారు.

శివారుల్లో భూసమస్యపై సీఎం దృష్టి

హైదరాబాద్‌లో ఇటీవల సీఎం నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగర శివారుల్లో ముఖ్యంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూసమస్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించినట్లు సమాచారం. దీంతో రెవెన్యూ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోంది. ఈ నేపథ్యంలోనే కీసర, కాప్రా మండలాల్లో ప్రభుత్వ భూముల్లో వెలసిన వందలాది అక్రమ నిర్మాణాలను శని, ఆది వారాల్లో టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు నేలమట్టం చేశాయి.

ప్రజాభవన్ ఆదర్శం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్‌రెడ్డి నగరంలోని ప్రగతి భవన్‌ను ప్రజాభవన్‌గా పేరు మార్చడంతో పాటు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మొదట స్వయంగా ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన సీఎం ఆ తర్వాత పలువురు మంత్రులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజావాణికి ఉన్నత స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ఇక్కడి ఫిర్యాదులు సీఎంఓ నుంచి నేరుగా కలెక్టర్లకు చేరుతుండటం.. కలెక్టరేట్లో ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రజావాణి నిర్వహించాలని ఆదేశాలు ఉండటంతో.. కలెక్టర్లు విధిగా హాజరవుతున్నారు. దీంతో కలెక్టరేట్లలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగింది.

భూసమస్యలివే...

- కీసర మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 918లో 259 ఎకరాలు, సర్వే నంబర్ 886లో 19 ఎకరాలు, సర్వే నంబర్ 887లో పది ఎకరాలు మొత్తం 324 ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసి సాల్వోక్స్‌ప్లో యాజమానులు ప్రహరీ గోడ నిర్మిస్తున్నారని స్థానికులు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ భూకబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
- కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రూ.25 వేల కోట్ల విలువ చేసే దాదాపు 1,250 ఎకరాల ప్రభుత్వ భూములను స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించారని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీజేపీ స్థానిక నాయకులు జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో అందోళన చేస్తామని హెచ్చరించారు.
- గాజులరామారం పరిధిలోని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్, సాబీర్‌నగర్, రావినారాయణరెడ్డి నగర్, సిద్దులానగర్‌లోని సర్వే నంబర్లు 307, 342, 329లో 153 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తెలిపారు.
- గాజుల రామారం సర్వే నంబర్ 307/ఏలోని 318.28 ఎకరాల్లో 120 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి.
- సాయినగర్ సర్వే నంబర్–49లో పది ఎకరాలు, షేక్‌బషీర్‌బాగ్ సర్వే నంబర్ 25/1లో 50 ఎకరాలు, సర్వే నంబర్ 25/1లో 19 ఎకరాలు, పరికి చెరువు పరిధిలో 20 ఎకరాలు, గాజులరామారంలోని సర్వే నంబర్100లో 13 గుంటలు, మల్లంపేట్‌లోని సర్వే నంబర్ 170లో పది ఎకరాలు, నిజాంపేట్ సర్వే నంబర్ 346లో ఆరు ఎకరాలు, ప్రగతినగర్ సర్వే నంబర్ 141, 142, 143లలో పది ఎకరాలు, బాచుపల్లిలోని సర్వే నంబర్ 490లో పది ఎకరాలు, గాజులరామారంలోని సర్వే నంబర్ 307లో వంద ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని బీజేపీ నాయకులు తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.
- జవహర్‌నగర్ నగరపాలక సంస్థలోని సర్వే నంబర్లు 476, 501లో రూ.30 కోట్ల విలువ చేసే ఐదు ఎకరాల స్థలాన్ని ఆక్రమించి బహుళ అంతస్తుల భవనంతో పాటు స్విమ్మింగ్ పూల్ తదితర విలాసవంతమైన కట్టడాలు నిర్మించుకున్నారని స్థానిక ప్రజలతో పాటు కోఆప్షన్ సభ్యురాలు కూతాడి శ్వేత జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు ఫిర్యాదు చేశారు.
- ఇదిలా ఉండగా, ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం ల్యాండ్ సర్వేకు సంబంధించి 5 ఫిర్యాదులు, ధరణికి సంబంధించి 25 ఫిర్యాదులు, భూవివాదాలవి 13 ఫిర్యాదులు అందాయి. అలాగే, ఎంసీపల్లి, శామీర్‌పేట్, కుత్బుల్లాపూర్ మండలాల్లో భూసమస్యపై 5, దమ్మాయిగూడ, తూముకుంట, దుండిగల్, నిజాంపేట్ పురపాలక సంఘాల్లో భూసమస్యపై 8 ఫిర్యాదులు అందాయి. కలెక్టరేట్లోని 'డి' సెక్షన్‌కు సంబంధించి 67, 'ఇ' సెక్షన్‌కు సంబంధించి 25 ఫిర్యాదులు, పోలీసు శాఖకు సంబంధించి 6 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అన్ని భాషలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డా.ఎన్‌వీఎస్ఎన్ లక్ష్మీ

మేడ్చల్‌రూరల్: కోడింగ్‌తో పాటు ఇతర భాషలపై అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూ ఆంగ్లభాష ఆచార్యులు, విభాగాధిపతి డా.ఎన్‌వీఎస్ఎన్ లక్ష్మీ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ఆంగ్లభాషపై లిటరరీ యూఫోరియా ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. కమ్యూనికేషన్ లోపం, ప్రస్తుత విద్యార్థులకు సమస్యగా మారిందని, దీన్ని అధిగమించేందుకు భాష ముఖ్యమని అన్నారు. అనంతరం పుస్తక సమీక్ష, చిత్రవివరణ, విషయ చర్చ, వ్యాసరచన, ఒక విషయంపై మాట్లాడటం, స్పెల్ బీ వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.ఆర్ లోకనాథ, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, విభాగాధిపతి ప్రొ సాయికిరణ్మయి, కన్వీనర్ శైలజారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో మున్సిపల్ నిధులు వెచ్చించి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని సింహపూరికాలనీలో సుమారు రూ.20 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో నాగారం మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ దివ్య దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు, కొమురయ్య, కృష్ణ తదితరులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్నూరు కాపు సంఘం నూతన సంవత్సరం కేలండర్‌ను ఎన్ఎఫ్‌సీ నగర్‌లో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లుపటేల్, పల్లవి ఫౌండేషన్ చైర్మన్ కొరమురయ్య పటేల్, విశ్రాంత సీఐ కృష్ణపటేల్ హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భగవద్గీత పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ అధ్యక్షుడు నందుపటేల్, అనిల్‌పటేల్, రవిపటేల్, రాంమోహన్‌పటేల్, వేణుపటేల్, మల్లేశ్ పటేల్, అశోక్‌పటేల్, రాజ్‌పటేల్, హరిపటేల్, సభాపతిపటేల్, విష్ణుపటేల్, ఆత్మారాంపటేల్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. జాగ్రత్త!

కుషాయిగూడ: సంక్రాంతి పండుగ సందర్భంగా చోటుచేసుకునే దొంగతనాలపై కుషాయిగూడ పోలీసులు అవగాహన చేపట్టారు. ఆటోతో ప్రచారం నిర్వహిస్తూ.. ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. సొంతూళ్లకు వెళ్లేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కుషాయిగూడ డీఐ సాయిప్రకాశ్‌గౌడ్ సోమవారం పలు కాలనీల్లో అవగాహన కల్పించారు. ఇళ్లకు తాళాలు వేసేవారు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వడం, ఇరుగుపొరుగు వారిని అప్రమత్తం చేయడం, అలారాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి జాగ్రత్తలను వివరించారు. ఎస్సై భద్రయ్య సిబ్బంది ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి ప్రతిరూపం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ పూజలతో విశేష పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వెంకటరమణాచార్యులు తెలిపారు. సోమవారం సుమారు 66 రకాల డ్రైఫ్రూట్స్, 23 రకాల ఇతర పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 10వ తేదీ పుష్పయాగం , 12న కూడార్తై ఉత్సవం, 13న శ్రవణానక్షత్రం సందర్భంగా చందన సేవ, 14న గోదారంగనాథుల కల్యాణంతో ధనుర్మాస పూజలు ముగుస్తాయని వివరించారు.

అల్వాల్ మేరు సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్

అల్వాల్: మేరు సంఘం అల్వాల్ జోన్ ఎన్నికలు లోతుకుంటలోని కార్యాలయంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా రాపర్తి చంద్రశేఖర్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు సంఘం సభ్యుల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దీకొండ వెంకటేష్, మాడిశెట్టి బాలయ్య, సోమ కొండయ్య, రామగిరి బిక్షపతి, కీర్తి సుధాకర్, గణేష్, కరణ్, మంతెన సంతోష్, ప్రభాకర్, చందు, సత్యానారాయణ, శీలం సంతోష్, కృష్ణ, గోపి, వినోద్, ప్రవీణ్, గంగాధర్, కిషన్, శ్రీనాథ్, సత్యనారాయణ, కృష్ణ, రామస్వామి, బాలనర్సయ్య, శేఖర్, ఓంరాజ్, రవీందర్, వసంతయ్య, రవి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

బోడుప్పల్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ జిల్లా ఎన్‌జీసీ (ఏకోక్లబ్), డీఈఓ విజయకుమారి, జిల్లా కో– ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనే అంశంపై ఏకపాత్రాభినయం, నాటిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని మైథిలీ ఏకపాత్రాభినయంలో రూ. 500లు నగదు బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ పాఠశాలలోని విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపల్ నీలిమా, మాస్టర్లు సాయికుమార్, వైష్ణవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

మల్లాపూర్: నాచారం పటేల్‌కుంట చెరువులోని గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను సోమవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జెన్‌శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెరువులోని గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి దోమల సమస్య లేకుండా చేస్తామని వివరించారు. పటేల్‌కుంట చెరువు అనంతరం హెచ్ఎంటీనగర్ చెరువులోని ఆకును కూడా తొలగిస్తామని తెలిపారు. చెరువులోని వ్యర్థాలు, డెక్కను తొలగించడం కోసం 25 మంది ఎంటమాలజీ సిబ్బంది ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహా, జంగం అశోక్, ఆశన్న, వాసు, కట్ట బుచ్చన్నగౌడ్, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ 40 వేల అప్‌లోడ్స్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజాపాలనలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో 2,29,000 దరఖాస్తులు వచ్చాయని, ప్రతిరోజూ 40 వేల అప్లికేషన్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 6 నుంచే దరఖాస్తుల వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్ల సమన్వయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులతో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన ముఖ్య కార్యదర్శి శాంత కుమారి, పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణ, కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వానాకాలం, యాసంగిలో పంట సాగు తదితర విషయాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈ నెల 16 వరకు దరఖాస్తుల్లోని వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారుల పర్యవేక్షణలో వివరాలు నమోదు చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ విషయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు అవగాహన కల్పించామన్నారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంపై సీఎం ప్రశంసించారని సీఎస్ శాంతకుమారి కలెక్టర్లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు) విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల అప్‌లోడ్ ప్రక్రియలో వేగం పెంచండి



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

కీసర: ప్రజాపాలనలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీలకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 12వ తేదీ వరకు కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో ప్రజాపాలన ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. ఇంకా ఎన్ని ఆన్‌లైన్ చేయాల్సి ఉందన్న విషయాలను మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంత్రం రెండు షిఫ్టుల వారిగా ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియను పూర్తిచేయాలని ఆయన సూచించారు.



గడువు లోపల దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేయాలి

ఘట్‌కేసర్: ప్రజల నుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను గడువు లోపల పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను కమిషనర్ సాబేర్ అలీతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులు, అలాగే ఆన్‌లైన్ చేయాల్సిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియలో తప్పులు దొర్లకుండా ఈ నెల 17లోపు పూర్తి చేయాలన్నారు.

వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలి



హబ్సిగూడ: హబ్సిగూడలోని సుప్రభాత్ హోటల్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ, ఓయూ ప్రొఫెసర్ కాశీంలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం జరగాలంటే ఉద్యమించాలన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, అన్ని ఉపకులాలకు న్యాయం జరిగేలా చూడా లన్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లను అంగీకరించాలని కోరారు. కోర్ కమిటీ సభ్యులు మీసాల మల్లేష్, బల్లగ్ హాస్సేన్, చిలకమరి గణేష్, మేరి, పాలడుగు శ్రీనివాస్, డప్పు శివరాజ్, కృష్ణ, శ్రీను, వేణు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్, ఇల్లందుల రాజేష్‌కన్నా, బొల్లం జ్యోతి, రజిని, వరలక్ష్మి, లక్ష్మమ్మ, చిన్నస్వామి, నరేష్, నందకిషోర్, నరేందర్, శాంతి, కిరణ్, రఘు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



బోడుప్పల్: న్యూఢిల్లీలో జరిగిన దక్షిణాసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం బోడుప్పల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో రెండు వేలమంది విద్యార్థులు పాల్గొనగా.. బోడుప్పల్‌కు చెందిన సాయిప్రియ, సమీక్ష, భవన్‌కుమార్, సహస్ర తేజు, భువన్‌తేజ్, తేజస్వి, నిత్య, సంజన స్వర్ణపతకాలు, ఆదిత్య, రియాన్ష్, కార్తీక్, వైష్ణవి, రజత పతకాలు, భువనేష్ బ్రౌన్ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు. ఈ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు నార్వే దేశంలో జరిగే స్వీయరక్షణ శిబిరానికి ఎంపికైనట్లు మాస్టర్ నవీన్‌కుమార్ వెల్లడించారు. గెలుపొందిన విద్యార్థులను ఆయన అభినందించారు.

అక్రమంగా చేపలు పడుతున్న వారిపై ఫిర్యాదు

ఘట్‌కేసర్: అవుషాపూర్ రాంచెరువు, గుండ్లకుంటలో సర్కారు సాయంతో పెంచుకుంటున్న చేపలను అక్రమంగా పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మేడబోయిన జంగయ్యముదిరాజ్ ఘట్‌కేసర్ పీఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేప పిల్లలను చెరువులో పెంచుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని లేఖలో తెలిపాడు. ప్రభుత్వ సహకారంతో పెంచిన చేపలు ఎలా పడతారని ప్రశ్నిస్తే మా భూమి.. మా ఇష్టం అంటూ అనిల్‌రెడ్డి, కద్దురెడ్డి, వీరేశం, మల్లేశ్ బెదిరించారని సీఐకి ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు.

ఆరోగ్యకరమైన వంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: పండగల సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో వండుకునే వంటకాలు ఆరోగ్యకరంగా ఉండేలా చూసుకోవాలని ప్రముఖ న్యూట్రిషన్, వెల్‌నెస్ కన్సల్టెంట్ షీలా కృష్ణస్వామి సూచించారు. కాలిఫోర్నియా ఆల్మండ్స్ నిర్వహించిన ఓ సమావేశంలో ఆమె మాట్లాడుతూ వంటకాల్లో బాదం పప్పుల మేళవింపు వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. విటమిన్ ఈ, మెగ్నీషియం, ప్రొటీన్, రిబోఫ్లావిన్ జింక్ వంటి 15 కంటే ఎక్కువ పోషకాలను కలిగి ఉండే 'బాదం' కొలెస్ట్రాల్‌ను దూరం చేస్తుందన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, చౌదరిగూడ, కాచవానిసింగారంలో అయోధ్య రామయ్య అక్షింతలకు సోమవారం ఘనస్వాగతం పలికారు. స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి రాముడు, రామ మందిరం చిత్రపటం, కరపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు వినతిపత్రం అందజేస్తూ..

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీతో పాటు మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు రామారావు ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్ రాజమల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు రామారావు, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆర్‌జీకే కాలనీలో నివాసముంటున్న ప్రజలు నిత్యం అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బస్తీ దవాఖానా పక్కనే టాయిలెట్స్, ఆర్‌జీకే కాలనీలో బస్సు ప్రాంగణం ఏర్పాటు చేయాలన్నారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు, మున్సిపల్ పరిధిలో మూడుచోట్ల వైకుంఠ ధామాలు నిర్మించాలని వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు గోగుల సరిత, వరగంటి వెంకటేష్, నాయకులు గోగుల వెంకటేష్, ఈగ శ్వేతరాజు, గుజ్జుక నర్మదపరశురాం, మహ్మద్ యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయం



మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్: జాతీయ స్థాయిలో గుండ్లపోచంపల్లికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు లభించింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం అవార్డును ప్రకటించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పరిశీలనలో గుండ్లపోచంపల్లి పలు విభాగాల్లో స్వచ్ఛతలో మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో రాష్ట్రంలో నాలుగు పట్టణాలు ఎంపిక కాగా అందులో గుండ్లపోచంపల్లి ఒకటిగా నిలిచింది. చెత్త లేని పట్టణం, స్వచ్ఛ భారత్‌ను పాటించడం వంటి కార్యక్రమాలు నిర్వహించడంతో తమ మున్సిపాలిటీకి అవార్డు లభించిందని కమిషనర్ రాములు తెలిపారు.

11న రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు..

జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 11న ఢిల్లీకి వెళ్లి తాను అవార్డు అందుకుంటానని ఆమె తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నుంచి తమకు ఆహ్వానం అందినట్లు ఆమె తెలిపారు.

నకిలీ పత్రాలతో 286 ఎకరాల భూమి కబ్జా

హిమాయత్‌నగర్: నవాబ్ రయీస్ యార్ జంగ్ బహదూర్‌కి చెందిన వేల కోట్ల విలువ చేసే విలువైన భూములను నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నవాబ్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా మరణించడంతో వేలాది కోట్ల రూపాయల విలువైన ఆ భూమిని కొంత మంది సంఘ విద్రోహ శక్తులు ఫోర్జరీ రిజిస్ట్రేషన్ పత్రాలను సృష్టించి ఆక్రమించుకుంటున్నారని, ఈ భూముల వ్యవహారాలపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపించాలని, ఈ భూములకు సంబంధించి ఫోర్జరీ, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వ్యక్తులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, బాలానగర్ మండల్, కూకట్‌పల్లి గ్రామంలో వారసులులేని దివంగత నవాబ్ రయీస్ యార్ జంగ్ బహదూర్ చెందిన సర్వే నెంబర్ 1007లోని 286 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలని, రూ.22,880 కోట్లు విలువైన ఈ భూమిని బహిరంగ వేలం వేయడం ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రజా సంక్షేమ పథకాల అమలు కోసం ఉపయోగించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ఎకరాకు రూ.80 కోట్లు కాగా మొత్తం విలువ దాదాపు రూ.22,880 కోట్లు ఉంటుందన్నారు. సాధిక్ మొహియుద్దీన్ అనే వ్యక్తి ఆ భూములను నవాబ్ రయీస్ యార్ జంగ్ బహదూర్ మనుమడు మహ్మద్ అలీ కొడుకు హషీమ్ అలీ అని తప్పుడు, ఫోర్జరీ మోసపూరిత హిబా, గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడ్డాడని, హషీమ్ అలీ అనే పేరు అధికారిక రెవెన్యూ రికార్డుల్లో ఎక్కడా లేదని, అందుకు సంబంధించిన ఆధారాలు కూడా లేవన్నారు. ఆ డాక్యుమెంట్లు కేవలం సృష్టించబడిన నకిలీ డాక్యుమెంట్లతో పలు సొసైటీలు, కంపెనీలు, పలువురు వ్యక్తులు నవాబ్ రయీస్ యార్ జంగ్ బహదూర్ కుటుంబానికి చెందిన భూములను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. చట్ట ప్రకారం ఒక వ్యక్తికి వారసులు లేకుండా ఉంటే ఆ వ్యక్తి ఆస్తులు ప్రభుత్వానికే దక్కుతాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కబ్జాదారుల నుంచి విలువైన భూములను కాపాడి, నకిలీ పత్రాలు సృష్టించి కబ్జాలకు పాల్పడ్డ సంఘ విద్రోహ శక్తులపై క్రిమినల్ కేసులు పెట్టి జైలుకు పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శి బి.స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, సమితి సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.